# "ఉత్తరం"



"డాడీ...! మీ కోసం అప్పులరాజుగారొచ్చారు".

బాత్ రూంలో ముఖం కడుక్కొంటున్న నా దగ్గరికొచ్చి చెప్పాడు అరుణ్‌గాడు.

"నోర్మయ్... వెధవా.., చిన్నా,పెద్దా లేకుండా! ఆయన వింటే ఏమనుకొంటాడు". వాడిని తిడుతూనే బయటికొచ్చాను. అప్పలరాజు నాతోపాటు మా కాలేజీలో పార్ట్ టైం లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. చీటికీ, మాటికీ అందరి దగ్గరా అప్పులు చేస్తుండటంతో... అతని పేరు కాస్తా 'అప్పులరాజ'య్యింది.

ప్రపంచంలో ఉన్న దైన్యమంతా ముఖాన మూట కట్టుకొని వచ్చినట్టున్నాడు అతను. వాలకం చూడగానే ఖచ్చితంగా అప్పు కోసమే వొచ్చాడని అర్థమైంది. "ఏంటోయ్... రాజా... సంగతులు" అంటూ పలకరించా.

"మూర్తీ... అర్జంటుగా వంద రూపాయలు కావాలి, జీతాలురాగానే ఇచ్చేస్తాను..... దయుంచి కాదనకు".

చెట్టంత మనిషి... ప్రాధేయపడుతుంటే... 'వెధవ గుండె' కరిగిపోయింది.

"దానికేముంది గానీ... రాజా, నీకు అభ్యంతరం లేకపోతే... అవసరం ఏంటో తెల్సుకోవచ్చా.....', ఏంలేదు అప్పు చేయడం నీకు అలవాటని నీ మీద ఒక నింద ఉంది, అందుకే అడిగాను". మొహమాట పడుతూనే అనేసాను. అతను జేబులోంచి ఒక ఉత్తరం తీసి నా చేతికి ఇచ్చాడు. "ఈ రోజు ఉదయానే... పోస్ట్‌లో వచ్చింది, మూర్తీ... రెండు రూపాయలు... 'డ్యూ' కట్టి మరీ తీసుకొన్నాను. అది చదివిన దగ్గర్నుండీ ఒకటే భయంగా ఉంది" అన్నాడు.

ఉత్తరంలో పైన 'జై సాయిరాం' అని ఉంది. ఎవరో భక్తుడు... ఇక్కడా పేరు, ఊరూ రాయలేదు. మొత్తం మీద సారాంశం ఏంటంటే..., బాబాను పూజించడం వలన మేలు జరుగుతుందనీ, ఈ ఉత్తరం అందుకొన్న వెంటనే, ఇలాంటివే వంద మందికి ఉత్తరాలు రాయాలనీ, లేదంటే.... జరగకూడని అనర్థాలు జరుగుతాయంటూ, ఏవేవో భయంకరమైన ఉదాహరణలు రాసాడు. ఆ ఉత్తరం చదివిన వాళ్ళకెవరికైనా భయం వేస్తుంది. విషయమంతా,అర్థమయ్యాక... అన్నాను.

"రాజా... దేవుడి పైన భక్తి, విశ్వాసం ఉండాలి గానీ, భయం కాదు ఇలాంటి చౌకబారు ప్రచారాన్ని కోరుకోడానికి... దేవుడు ఏమైనా కూల్‌డ్రింక్ కంపెనీనా?, కొత్తగా రిలీజైన సినిమానా? నాకు తెలిసి ఏ దేవుడూ ఉత్తరాలు రాయనంత మాత్రాన చిత్రహింసలు పెట్టడు. ఇదంతా మూఢనమ్మకాలతో, అజ్ఞానం వల్ల మూర్ఖులు చేసే పని. నీకు అప్పివ్వకుండా... తప్పించుకోవడం నా ఉద్దేశ్యం కాదు గానీ, నువ్వు ఈ విషయంలో నిశ్చింతగా ఉండొచ్చు".

నా మాటలు అతన్ని సంతృప్తిపరచలేక పోయాయని అర్థమౌతూనే ఉంది. ఉత్తరాన్ని తిరిగి అతనికిచ్చేయబోతూ, మరోసారి పరిశీలనగా చూసా, ఆ చేతివ్రాతని ఎక్కడో చూసి నట్టుంది. అక్షరాలుబాగా పరిచయమున్నవిలాగ అనిపించాయ్. దాన్ని తీసుకొని ఇంట్లో కెళ్ళా, షెల్ఫ్‌లోంచి హాఫ్ ఇయర్లీ ఎగ్జామ్ ఆన్సర్ షీట్స్ తీసా, నా అనుమానం తప్పు కాలేదు. ఆ చేతిరాత కిరణ్ అనే నా స్టూడెంట్‌ది. అరుణ్‌ని పంపించి అతనిని పిలిపించాను.

నా దగ్గర అబద్ధమాడేంత ధైర్యంలేదు వాడికి.

"సార్...నాకు కూడా అలాంటిదే ఓ ఉత్తరం వచ్చింది. వంద ఉత్తరాలు రాస్తే నాకు స్కూల్ ఫస్ట్ వస్తుందనీ... లేదంటే ఫెయిల్ అవతాననీ ఉంది. అందుకనే భయంలో వంద చిరునామాలు సేకరించి, ఏదేదో కల్పించి ఉత్తరాలు రాసేను. ఇది రాసింది నేనే... నన్ను క్షమించండిసార్" ఏడుస్తూ కాళ్ళ మీదపడ్డాడు.

"చూసావా... రాజా...! నిజం తెలీక ఎంత కంగారు పడ్డావో... ఇదొక జబ్బులాంటిది. ఒకరి నుండి ఇంకొరికి ప్రాకి, లేనిపోని సమస్యలు తెచ్చి పెడుతుంది. ఇంక నీకే భయం లేదు" అన్నాను.

అప్పటికి కుదుట పడ్డ అతను 'హమ్మయ్యా' అనుకొని వెళ్ళిపోయాడు.

"రాజా... నీ అప్పుల భారం మరో 'వంద' పెరగకుండా... కాపాడగలిగాను" సంతృప్తిగా అనుకొన్నాను.

-గరిమెళ్ళ నాగేశ్వరరావు(సూర్య),
13-88-3, వేపారి వీధి,
చోడవరం -531 036,
విశాఖజిల్లా.